క్లుప్తంగా

జయప్రదం చేయాలి

ఆత్మకూరు : వచ్చేనెల 3న హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన ధర్మసమాజ్ పార్టీ కార్యకర్తల మహా సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి మైదం రవి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో అందుకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సలీంపాషా, నాయకులు శివ, శ్రీనివాస్, శైలానీబాబా పాల్గొన్నారు.

‘ధర్మయుద్ధానికి’ తరలిరావాలి

ఐనవోలు : మాదిగల ధర్మయుద్ధం సన్నాహక సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొక్కల నారాయణ పిలుపునిచ్చారు. గురువారం నందనం గ్రామంలో అనుబంధ సంఘాలతో సమావేశమై మాట్లాడారు.

దామెరలో..

దామెర : మాదిగల ధర్మయుద్ధం మహా సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ గోవిందు రవికుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని సింగరాజుపల్లిలో గురువారం కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 26వ తేదీన కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించనున్న మహాసభకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

అయ్యో పాపం..

- ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలి మృతి





కవిత(ఫైల్)

కమలాపూర్: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ మృతి చెందిన ఘటన హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం వంగపల్లిలో గురువారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. వంగపల్లికి చెందిన అంకిల్ల కవిత (36) వారం రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఆమెను బుధవారం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు సీరియస్‌గా ఉందని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి రెఫర్ చేయగా.. కుటుంబ సభ్యులు ఆమెను ఎంజీఎంకు తీసుకెళ్లి వైద్యం చేయించారు. గురువారం ఉదయం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత హనుమకొండ-వేములపల్లి బస్సులో వంగపల్లికి తీసుకువస్తున్నారు. ఈ క్రమంలో అంబాలకు వరకు వచ్చిన తర్వాత ఒక్కసారిగా చలి పెడుతోందనడంతో భర్త కుమారస్వామి చెద్దరి కప్పాడు. వంగపల్లికి వచ్చాక దిగడానికి కవితను లేపే సరికి సీట్లోంచి కింద పడిపోయింది. పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉంది. ఆమెకు కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కవిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ హామీ ఇచ్చారు. దహన సంస్కారాల నిమిత్తం రూ.5 వేలు గ్రామ కాంగ్రెస్ కార్యకర్తల ద్వారా అందజేశారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఆత్మకూరు : గడ్డిమందు తాగి చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని అగ్రంపహాడ్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన ప్రకారం ప్రకారం.. అగ్రంపహాడ్ గ్రామానికి చెందిన జక్కుల కుమారస్వామి (65) కొంత కాలంగా మద్యానికి బానిసై కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో కడుపు నొప్పి ఎక్కువ అవడంతో బుధవారం రాత్రి గడ్డిమందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా గమనించిన భార్య స్వరూప స్థానికుల సాయంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం తొర్రూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్సపొందుతూ గురువారం మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలి

ఐనవోలు : మండలంలో ఖాళీగాఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీపీఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. గురువారం మండల కేంద్రంలో సీపీఎం మండల నాయకుడు కాడబోయిన లింగయ్య, మడిగ నాగరాజు మాట్లాడుతూ.. లింగమోరిగూడెం, ముల్కలగూడెం గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుల ఖాళీగా ఉన్నాయన్నారు. యూపీఏ గవర్నమెంట్‌లో సీపీఎం పోరాట ఫలితంగా ఉపాధి హామీ చట్టం వచ్చిందని గుర్తుచేశారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లను నియమించకుండా ఉపాధి హామీ చట్టం నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఆరోపించారు. గ్రామాల్లోని నిరుపేదలు వేసవికాలం వచ్చిందంటే ఉపాధి హామీ పనులతో ఇళ్లు వెళ్లదీసుకుంటారని, ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో పనుల్లో అవకతవకలు జరిగే ప్రమాదం ఉందని అన్నారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

- పిచ్చిమొక్కలతో నిండుకున్న గ్రౌండ్
- అసహనం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు
- అధికారులు దృష్టిసారించాలని విజ్ఞప్తి



పిచ్చిమొక్కలతో నిండిన క్రీడా ప్రాంగణం

ఐనవోలు : గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించి వారిలోని నైపుణ్యాన్ని వెలికితీయాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ప్రతీ గ్రామపంచాయతీలో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో స్థల సేకరణకు కొన్ని ఆటంకాలు ఎదురైనా రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు ఎట్టకేలకు క్రీడా మైదానాలకు ప్రభుత్వ స్థలాలను కేటాయించారు. అనంతరం అదే సంవత్సరం సెప్టెంబర్, అక్టోబర్‌లో దాదాపు అన్ని జీపీల్లో క్రీడా ప్రాంగణాలను ప్రారంభించారు. యుద్ధ ప్రాతిపదికన వాలీబాల్, ఖోఖో, కబడ్డీ కోర్టులను కూడా ఏర్పాటు చేశారు. ఈజీఎస్ నిధులు వినియోగించుకుని ప్రాంగణమంతా చదునుచేసి క్రీడాకారులకు అనుగుణంగా తయారు చేశారు.

నిండుకున్న పిచ్చిమొక్కలు

అయితే ప్రారంభ దశలో క్రీడా మైదానాల ఏర్పాటుకు హడావుడి చేసిన అధికారులు.. అరకొర వసతులు కల్పించి చేతులు దులుపుకొన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాటి నిర్వహణపై దృష్టి సారించేవారే కరువయ్యారని క్రీడాకారులు ఆగ్రహిస్తున్నారు. క్రీడా మైదానాలకు ప్రభుత్వం వెచ్చించిన నిధులు వృథా అవడమే కాకుండా క్రీడల పట్ల ఆసక్తితో ఉన్న క్రీడాకారులకు అన్యాయం జరుగుతుందని పలువురు వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్లు పట్టించుకుని క్రీడా మైదానాలను చదును చేయాలని కోరుతున్నారు. ఫిట్‌నెస్ కోసం, ఆరోగ్యం కోసం నిత్యం వాకింగ్ చేసే వాళ్లకూడా పిచ్చిమొక్కల కారణంగా క్రీడా మైదానాల్లోకి అడుగు పెట్టడం లేదని అంటున్నారు.

ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి

క్రీడా ప్రాంగణాలను చదును చేసి యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని స్థానికులు కోరుతున్నారు. క్రీడా విభాగాల్లో జాతీయస్థాయిలో తెలంగాణ క్రీడాకారులు ఉండేలా చర్యలు తీసుకోవాలని అంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.



మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణం

క్రీడలకు ప్రాధాన్యం కల్పించాలి



గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం దష్టిసారించాలి. క్రీడలపై ప్రతీ గ్రామంలో అవగాహన కల్పించాలి.

– సదానందం, మాజీ సర్పంచ్, పంథిని

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



మాట్లాడుతున్న సీఐ రంజిత్‌రావు

దామెర : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పరకాల రూరల్ సీఐ రంజిత్‌రావు హెచ్చరించారు. మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామస్తులతో గురువారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అనవసరమైన గొడవల్లో తలదూర్చి కేసులపాటు కావద్దని అన్నారు. దసరా పండుగ సందర్భంగా జరిగిన గొడవలో నిందితుడిగా గుర్తించబడిన చిలువేరు రాజేందర్‌పై కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. యువకులు అనవసరమైన గొడవల్లో తలదూర్చి తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఈ సమావేశంలో ఎస్సై కొంక అశోక్, సిబ్బంది, గ్రామస్తులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కేయూ వీసీకి పలువురి అభినందనలు



వీసీని సన్మానిస్తున్న కృష్ణమాదిగ, తదితరులు



సదస్సుకు ఆహ్వానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ వీసీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, తదితరులు గురువారం వీసీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు బొకే అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కృష్ణమాదిగ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని వీసీని కోరారు. కార్యక్రమంలో కేయూ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ పుల్లా శ్రీనివాస్, పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ వెంకట్, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ బాధ్యులు బొక్క మొగిలి, డాక్టర్ సత్య జాల, డాక్టర్ వడ్డెపెల్లి మధు తదితరులు పాల్గొన్నారు.

వీసీని కలిసిన ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాల అధ్యాపకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ వీసీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డిని హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి, అధ్యాపకులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఈనెల 25న పింగిళి కళాశాలలో నిర్వహించనున్న తెలుగు విభాగం జాతీయ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొనాలని వారు ఆహ్వానించారు. ఈమేరకు ఆహ్వాన పత్రాన్ని వీసీకి అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సురేష్‌బాబు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ అరుణ, అధ్యాపకులు మధు, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి, రాజు, సారంగపాణి, రాంరెడ్డి, డాక్టర్ లకన్ సింగ్ పాల్గొన్నారు. అలాగే, హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జువాలజీ అధ్యాపకులతో పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం మాజీ అధ్యక్షుడు డాక్టర్ సంజీవయ్య, తదితరులు వీసీని కలిసి అభినందనలు తెలిపారు.

దర్గాలో ఎమ్మెల్యే ‘గండ్ర’ ప్రార్థనలు



శాయంపేట : మండలంలోని గోవిందాపూర్ గ్రామ శివారులో గల వాహెద్ నగర్‌లోని హజ్రత్ సూఫీ మహ్మద్‌ఖాజా మొహినోద్దీన్ అజ్మీరీ దర్గాను గురువారం రాత్రి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సందర్శించారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి ఖాజా ఫరిదొద్దీన్ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మత పెద్దలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



శాయంపేట : ఆటోలో కూర్చున్న బాలిక కుడి చేతికి ద్విచక్ర వాహనం బలంగా తాకడంతో పాపతో పాటు ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం రాత్రి జరిగింది. ప్రత్యక్ష సాక్షుల తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన ఆకునూరి రమేశ్ పని నిమిత్తం శాయంపేటకు వచ్చి తిరిగి ఆటోలో కుటుంబ సభ్యులతో కలిసి పత్తిపాకకు బయలుదేరారు. జీవన్‌నగర్ సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఆటో ప్రక్క నుంచి వెళ్తూ ఆటోలో కూర్చున్న రమేశ్ కూతురు కల్యాణి కుడిచేతికి బలంగా తాకింది. దీంతో అదుపుతప్పిన ద్విచక్ర వాహనం కింద పడింది. ఈ ఘటనలో కల్యాణి కుడిచేతికి గాయాలు కాగా ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తికి కూడా గాయాలయ్యాయి. ఎస్సై ప్రమోద్‌కుమార్, ఏఎస్సై కుమారస్వామి ఘటనా స్థలానికి చేరుకొని 108 లో క్షతగాత్రులను వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

ఏఓగా కవిత



వేలేరు : మండల వ్యవసాయ శాఖ అధికారిగా ఏ.కవిత గురువారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ పురుగుమందుల ల్యాబ్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆమె డిప్యూటేషన్‌పై వేలేరుకు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏఈఓలు, సిబ్బంది తదితరులు ఆమెను సన్మానించారు.

వైభవంగా వాల్మీకి నవరాత్రోత్సవాలు



అన్నదాన కార్యక్రమంలో జంగా, తదితరులు

మడికొండ: వాల్మీకి నవరాత్రోత్సవాల్లో భాగంగా వాల్మీకి ఆలయం వద్ద గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మినుగు రాంచందర్ కుటుంబ సభ్యుల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయిల్ సీడ్ రాష్ట్ర చైర్మన్ జంగా రాఘవరెడ్డి ప్రారంభించారు. శుక్రవారం సాయంత్రం వాల్మీకి ఊరేగింపు నిర్వహించనున్నటు వాల్మీకి సంఘం అధ్యక్షుడు బోగి లింగమూర్తి తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం కులస్తులు పేర్ల సురేష్, కుర్ల మోహన్, మినుగు సతీష్, కంచనపల్లి వెంకటయ్య, బోగి లింగయ్య, ముస్కె సాంబయ్య, నిగ్గుల వెంకటప్రసాద్, బోగి శ్రీనివాస్, మండల సురేష్, ముచ్చు అర్జున్, బోగి కృష్ణ, తిరుపతి, వినయ్, కార్తీక్, విజయ్, రవీందర్, మినుగు సతీష్, భరత్, వీరేష్, ఉదయ్, సందీప్, నాయకులు బైరి లింగమూర్తి, పైడిపాల రఘుచందర్, పల్లపు అర్జున్, వస్కుల శ్రీనివాస్, పాల్గొన్నారు.

సీతారామచంద్ర స్వామి ఆలయంలో పూజలు



ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు

మడికొండ: పునర్వసు నక్షత్రం సందర్భంగా సీతారామచంద్ర స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. యాగశాలలో గణపతి హోమం, రుద్ర హోమం నిర్వహించారు. శ్రీరాముడి జన్మనక్షత్రం సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చకులు అర్చనలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శేషభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్, ధర్మకర్తలు, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనచార్యులు, సత్యనారాయణ శర్మ, మణిశర్మ, సాయిశర్మ, భక్తులు అద్దెంకి సురేష్, వెంకన్న, నర్సింహ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దర్గా ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి సన్మానం



కాజీపేట రూరల్: తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హెచ్ఐవీ / ఎయిడ్స్ క్విజ్ కాంపిటీషన్‌లో కాజీపేట దర్గా ప్రభుత్వ ఉన్నత పాఠశాల జాగీరుకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఎండీ.కరీముల్లా పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచాడు. నవంబర్‌లో జరగనున్న రీజినల్ స్థాయి క్విజ్ కాంపిటీషన్‌కు ఎంపికయ్యాడు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యార్థి కరీముల్లాను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, హెడ్‌మాస్టర్ ఎస్ఎంఎం.స్వామి, ఉపాధ్యాయులు, రాజమోహన్ అభినందించారు. కార్పొరేటర్ విజయశ్రీరజాలి ఉన్నారు.

నీరా.. తనివితీరా



కాజీపేట: ఈత చెట్ల నుంచి ఉదయం పూట తీసే నీరాకు ప్రజల నుంచి విశేష ఆదరణ ఉంది. ఈ నీరాలో అనేక ఔషధ గుణాలున్నాయని, అది తాగితే రోగ నిరోధక శక్తి పెరుగుతుందనే భావన ఉంది. షుగర్ పేషంట్లకు దివ్య ఔషధంగా పని చేస్తుందనే నమ్మకంతో చాలా మంది నీరా తాగేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కాజీపేట మండల కేంద్రం శివారులో ఉన్న అనేక గ్రామాల్లో ఈత చెట్ల నుంచి గీత కార్మికులు ఉదయం, సాయంత్రం నీరా సేకరించి విక్రయిస్తున్నారు. ఉదయం పూట తీస్తున్న నీరా కొనుగోలుకు అనేక మంది ముందుకు వస్తుండడంతో నీరాకు మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉంది. ముందస్తుగా ఫోన్లలో నీరాకు ఆర్డర్ చేసి మరీ కొనుగోలు చేస్తున్నారు.

సమాజ సేవలో యువత ముందుండాలి



ఏసీపీ తిరుపతికి రక్తదాత సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్

ఖిలా వరంగల్ : యువత సన్మార్గంలో పయనిస్తూ సమాజ సేవలో ముందుండాలని వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ సూచించారు. సేవాభావంతో రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించకుని మామునూరు సబ్ డివిజన్ ఏసీపీ తిరుపతి ఆధ్వర్యంలో ఐనవోలు, పర్వతగిరి, గీసుగొండ, ఏనుమాముల, మామునూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఫార్మసీ కళాశాల ఆడిటోరియంలో మెగా రక్తదాన శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రక్తదానంపై అపోహలు వీడాలని అన్నారు. ఒక్క రక్తపు చుక్క నిండు ప్రాణాలను కాపాడుతుందని అన్నారు. పోలీసులు సేవా దృక్పథంతో తమ విధులు నిర్వహించాలని, ఆపదలో ఉన్నవారిని కాపాడేందుకు ప్రయత్నించాలన్నారు. అనంతరం ఎంజీఎం డాక్టర్ ఆశా మాట్లాడుతూ.. రక్తదానం చేయడం వలన వచ్చే లాభాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంజీఎం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషన్లు 276 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. వాగ్దేవి విద్యా సంస్థల అధినేత దేవేందర్‌రెడ్డి, సీఐలు రాజగోపాల్, రాఘవేంద్ర, మహేందర్, రమేశ్, ఎస్సైలు శ్రీకాంత్, కృష్ణవేణి, శ్రీకాంత్, రాజు, శ్రీనివాస్, నరేష్, ప్రవీణ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ధరణిలో పొందిన పట్టాలను రద్దు చేయాలి

- డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

ఎల్కతుర్తి : ఇందిరాగాంధీ ప్రభుత్వ హయాంలో దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూములకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పేరుతో అక్రమంగా పట్టాలు మంజూరు చేసిందని, వాటిని వెంటనే రద్దు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ భూములైన పంచారాయి శిఖాలను దళితులకు పట్టాలిచ్చారని గుర్తుచేశారు. కొన్ని జిల్లాల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూములను కబ్జా చేసి వ్యాపారం చేస్తున్నారని, ప్రభుత్వ యంత్రాంగం కళ్లు మూసుకుంటుందని ఆరోపించారు. ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేసేంత వరకు పోరాటాన్ని ఆపేదిలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూములను సర్వేచేసి దళితులకు శాశ్వత హక్కు కల్పిస్తూ పట్టాపాస్‌బుక్‌ను అందించాలని డిమాండ్ చేశారు. మనోహర్, రాములు, రాజకుమార్, విజయ్, సాంబయ్య, నాగయ్య పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు చేస్తే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ నాగమల్లేశ్వర్

ఆత్మకూరు : బ్యాంకు అధికారులపై అసత్య ఆరోపణలు చేస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని మండలంలోని నీరుకుళ్లలో గల యూనియన్ బ్యాంకు మేనేజర్ నాగమల్లేశ్వర్ స్పష్టం చేశారు. యూనియన్ బ్యాంకు ఆవరణలో గురువారం విలేకరులతో మాట్లాడారు. కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా కొంతకాలంగా బ్యాంకు అధికారులపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. బ్యాంకులో రుణం తీసుకున్నవారు పూర్తి రుణాన్ని తీర్చితేనే మళ్లీ రుణమిస్తామని తెలిపామని, దీంతో కొందరు నిరాధారణమైన ఆరోపణలు చేయడం తగదన్నారు. ఆరోపణలు చేసిన వారికి లీగల్ నోటీసులు పంపిస్తామని ఆయన అన్నారు. అవసరమున్న వారందరికీ రుణాలు ఇస్తున్నామని, బ్యాంకు శాఖకు ఉత్తమ అవార్డు కూడా లభించిందని ఈ సందర్భంగా తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజల మనిషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

ఐనవోలు : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజల మనిషని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ మంత్రివర్గ సహచరుల సలహా, సూచనలతో రాష్ట్రాన్ని అద్భుతంగా పాలిస్తుంటే ప్రతిపక్షాలు ప్రభుత్వంపై నిందలు వేస్తున్నాయని మండిపడ్డారు. గురువారం నందనం ఎఫ్ఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో రాంనగర్ గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి ఆకయన ప్రారంభించారు. అనంతరం రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దని, రైతులు పండించిన ప్రతీ గింజ కొనుగోలు చేస్తామన్నారు. అంతే కాకుండా సన్న వడ్లకు రూ.500 బోనస్ అందజేస్తున్నట్లు తెలిపారు. గతంలో క్వింటాల్‌కు 10 కిలోలు మిల్లర్లు తరుగు తీసేవారని, ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవన్నారు. రైతులకు ఎలాంటి సమస్య ఉత్పన్నమైన నేరుగా 80961017107 నంబరుకు కాల్ చేయవచ్చన్నారు. సమస్యలను రెండు, మూడు రోజుల్లోనే పరిష్కరిస్తానన్నారు. రుణమాఫీ కానివారు చేతులు ఎత్తాలని కోరాగా చాలామంది రైతులు చేతులు పైకి ఎత్తారు. రెండు నెలల్లో రుణామాఫీ పూర్తి చేస్తామంటూ ఆయన చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గత పది సంవత్సరాల కాలంలో రాష్ట్రాన్ని దోచుకుని ఆ డబ్బుతో పేయిడ్ ఆర్టిస్టులతో హైడ్రాను అడ్డుకుంటుందన్నారు. త్వరలో వరంగల్‌కు కూడా వాడ్రా వస్తుందని, చెరువులను ఆక్రమించుకున్న వారి భరతం పడుతామన్నారు. టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు చేసిన మూడు రోజుల్లోనే డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. గ్రేడ్ ఏ రకానికి రూ. 2,320, సాధారణ రకానికి రూ.2,300తో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విక్రమ్‌కుమార్, సొసైటీ నోడల్ ఆఫీసర్ సునీల్‌కుమార్, ఏఓ సునీల్‌రెడ్డి, ఏఈఓ హీనా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్, నాయకులు దేవేందర్, భాస్కర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, సాంబయ్య, సొసైటీ డైరెక్టర్లు, సీఈఓ సంపత్ పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘన

టెస్కాబ్ చైర్మన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వేదికపై కూర్చుని ప్రొటోకాల్ ఉల్లంఘించారని స్థానికులు ఆగ్రహించారు. ప్రభుత్వ కార్యక్రమమా, కాంగ్రెస్ పార్టీ కార్యక్రమమా అంటూ స్థానికంగా పలువురు రైతులు విమర్శలు గుప్పించారు.

కార్యాలయ మరమ్మతులకు నిధులు మంజూరు



మరమ్మతులు చేయిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు

ఐనవోలు : మండల కేంద్రంలోని ఎస్సీ సంక్షేమ హాస్టల్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మండల పరిషత్ కార్యాలయ మరమ్మతులకు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య రూ. 5 లక్షల ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్లు ఎంపీడీఓ పులి వెంకటేశ్వర్లు తెలిపారు. భవనం పైకప్పు మరమ్మతు, కలర్లు వేయడం, విద్యుత్ బోర్డులు ఏర్పాటు చేయడం, కాంపౌండ్ తదితర పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. నిధులను సక్రమంగా ఉపయోగించి పనులు పూర్తి చేస్తామన్నారు.